

# సుబ్బారాయుడి రహస్యజీవితం

## త్రిపుర

సుబ్బారాయుడు కూరల సంచి చేతిలో వేళ్లాడిస్తూ మార్కెట్లో పడ్డాడు. జేబులో ఇరవయి ఆరు నయాపైసలు. నోటిలో బీడీకంటె కొంచెం— చాలా కొంచెం— ఎక్కువ ఖరీదయిన సిగరెట్. వలిగిన పైజామా, పిట్టలు పీకినట్లు క్రాపు. దుకాణాలనిండా కమలాలు, నారింజపండ్లు, ద్రాక్ష.

కాలిఫోర్నియాలో ఎంతంత, ఎంత పెద్ద, ఎంత ఎక్కువగా ఉంటాయో ఈ పళ్లన్నీ అనుకున్నాడు. కాలిఫోర్నియ్యాలో, వెనిజ్యులాలో, ఫ్లోరిడాలో.. కాశ్మీర్‌లో.... కాశ్మీర్‌లో....

... నీలి ఆకాశంలోని దూదిమేఘాల నీడలు సరస్సులో ప్రతిఫలిస్తుంటే, 'షికారి'మీద పాషలాగ కూర్చుని హుక్కా పీలుస్తూ... సరసమ్మని అర్ధనిమీలిత నేత్రాలతో చూస్తున్నాడు. సరసమ్మేనా ? ! సిల్హెట్ నారింజ రంగులో నవనవలాడిపోతూ, ఔరంగబాద్ హిమ్రూ చీరలో మెరిసిపోతూ, ప్రేమ కళ్లలోంచి ఒలికి పోతూంటే......

'ఏటలాగ తన్నుకు పోతున్నావ్. కళ్లు నేవేటి..'' మామిడిపళ్ల అమ్మి గదమాయింపుతోటి, కాశ్మీర్ నుంచి కురపాం మార్కెట్‌లోకి పడ్డాడు సుబ్బారాయుడు.

'బీరకాయలు వీసెంతేమిటి ?'

'పావలా, బాబూ.'

'బేడ కివ్వవ్ ?'

'ఏ వూరేటి బాబు మీది ?'

'ఈ వూరే గాని, మూణ్ణాల కిస్తావా ?'

'ఈ వూరయితే అలగడుగుతారా. బజారంతా అయిదణాల కమ్ముతుంటే..'

మూడణాలకి తగ్గించాలి. బీరకాయలు బాగున్నాయి. నాకు బీరకాయలు యిష్టం. మూడణాలు బీరకాయలు వీసె. బేరమాడాలి.... ఇంకా బేరమాడాలి.... బేరమాడాలి బేరం....

చుట్టూ 'మాక్' ఫోటోలు గోడలమీద. ఎదురుగా నవ్వుటి జున్నులాగ 'ఛౌ' ముఖం. తొందర తొందరగా మాట్లాడే ముఖం. ఇంటర్‌ప్రెటర్ వాంఘూ కాసన్‌గా అంత త్వరగానూ తర్జుమా చేస్తున్నాడు ఇంగ్లీషులోకి. తనపేరు అక్కడక్కడ దొర్లుతూంది, యువర్ ఎక్సెలెన్సీ 'సుబ్రుడూ' అని.. నవ్వుకున్నాడు. మైదానం లాంటి టేబుల్ మీద పరచిన మేప్‌లో 'ఢోలా' వేపు దీక్షగా చూశాడు ... ''యుగయుగాలనుంచీ, తరతరాల నుంచీ ఢోలా భారతీయుల వశంలో ఉంది. క్రీ. శ. 1234లో మీ చైనా దేశీయుడు ఫాన్ యూకింగ్ సర్వే చేసినపుడు ఢోలా భారతదేశంలో ఉన్నట్లు చూపించారు. మా డాక్యుమెంటు నం.164956/C చూడండి .. వెనకనుంచి నమ్రత ఉట్టి పడుతూ సెక్రటరీ ఆ కాగితాన్ని తనకి అందించాడు. మెల్లగా మెత్తగా ఆబ్జెక్టివ్‌గా చదువుతున్నాడు ... 'ఛౌ' ముఖంలో మార్పు, ఆవేదన. తను చదువుకు పోతున్నాడు. తన స్టాఫ్ 'ఛౌ' ముఖంవేపు ఏంక్షస్‌గా చూస్తూ, చూస్తూ .. సెక్రటరీ మెల్లగా అన్నాడు చెవిలో....'ఢోలా ఇంక మనదే'.'ఛౌ'ముఖం పూర్తిగా చెడిపోయిన జున్నులాగ మారిపోయింది.

వెనకని 'విస్పర్స్.. ' సుబ్బారాయుడు లేకపోతే, ఢోలా మన చేతిలోంచి పోయేదే . ఎంత బాగా బేరమాడారు. స్టాఫర్డ్ క్రిప్స్ తరువాత యీయనే. ఢోలా చేతిలోంచి పోయేదే పోయేదే . పోయేదే . ..

'అలా సంచి వేలమీదికి ఒగ్గేస్తారేటి తిన్నగెట్టండి.' సంచిలో పోయించేసుకుని మార్కెట్ బయటికి వచ్చేశాడు సుబ్బారాయుడు. ఆఖరి సిగరెట్ జేబులోంచి పైకి తీశాడు నలిగిపోయి ఉంది. అగ్గిపెట్టె లేదు బంకు దగ్గరకెళ్లి చాంతాడు నిప్పుతో అంటించాడు దమ్ము లాగాడు దగ్గు గట్టిగా దమ్ము లాగాడు, గట్టిగా దగ్గు మెయిన్ రోడ్డుమీద పడ్డాడు. రెండు పక్కలా నిండుగా, గర్వంగా రంగురంగులుగా షాపులు శెట్టి షాపు పక్కన సింధీ దుకాణ్ దాని ప్రక్కన బంగారం. బంగారాన్ని అంటిపెట్టుకుని జోళ్లు. జోళ్ల వాసన కొట్టూ పక్కన కిళ్లీలు. కిళ్లీలకి కొంచెం వెనకని ఫోటోగ్రాఫర్. ఫోటోగ్రాఫర్‌కి ఎదురుగా చింతపండు, ఉల్లిపాయలు. వాటి పక్కని కాంపిటేషన్‌గా ఉల్లిపాయ పొరల్లాంటి చీరలు వేళ్లాడగట్టిన షాపు.షాపులో వల్లగా,డబ్బుగా ప్రొప్రయిటరు.

పక్కనుంచి జోరుగా ఏంబులెన్స్ దూసుకుపోయింది కె జి ఎచ్ కి మోసేస్తున్నారు. ఎవరినో ? ఏం జబ్బో ఎంత సీరియస్ కేసో .. ఎంత డేంజరో.... ఎవరు చూస్తారో ... ఎంత డేంజరో.... ఎంత.... ఎంత ...

స్ఫటికలాగ తెల్లగా, ప్యూర్‌గా .... తళతళ మెరుస్తూ కత్తులూ, సిస్టర్సూ, యిన్‌స్ట్రుమెంటులూ ..శవంలాగ బల్లమీద పేషెంట్ పడుకున్నాడు క్లోరోఫారం మత్తులో. ఎనేస్థెటిస్ట్ వాచ్ చూసుకుంటున్నాడు. 'ఇంకొక నిముషంలో మీరు మొదలు పెట్టొచ్చు, డాక్టర్' అన్నాడు. డాక్టరు సుబ్బారాయుడు మాస్క్ తగిలించుకుని, తయారుచేసిన చర్మంమీద కత్తితో మార్క్ చేశాడు. చుట్టూ అరడజను ముఖాల్లో ఆత్రుత, ఎడ్మిరేషన్.

'లింట్, ప్లీజ్.'

చేతిలో లింట్.

కాటన్....

చేతిలో కాటన్.

'టూర్నికే కొంచం గట్టిగా కట్టు..'

రక్తస్రావం ఆగింది. ..

సెకండ్లు భారంగా ఒకదాన్నొకటి తరుముకుంటూ, పరుగెటుతూ, భారంగా....

ఎనేస్థటిస్ట్ కళ్లల్లో ఆశ. .. మెల్లిగా నిట్టూర్పు.

మెషీన్‌లా పనిచేస్తూంది థియేటర్ నర్స్....

'డై వాల్వ్యులర్ గంగ్రైటిస్'. ... ప్రాణాపాయం ఎక్కడో ఎవరో చేయగలరు. ఈ ఆపరేషన్ బ్రెజిల్‌లో డాక్టర్ ఫడేర్‌గాస్టో చేశాడు 1954 లో. తరువాత యిక్కడ ఈ మారు మూల ఆంధ్రప్రదేశ్‌లో సుబ్బారాయుడే. తనే

చెమట గ్లోవ్స్ రక్తమయం. చెమట బొట్లు. చెమట బొట్లు, బొట్లు.... బొట్లు . చస్తే లాంటి నుదురుమీద చెమట బొ. .. ట్లు . .

చొక్కా పైకెత్తి అంచుతో ముఖం తుడుచుకున్నాడు. కంపు మట్టి. చొక్కా కంపు, మట్టి ముఖంమీద. సైకిల్‌షాపులో చక్రభ్రమణం గుండయ్యరు హోటల్లో దోసెల కణికణిలు పైని సుఖంగా ఎర్రగా కిళ్లీలు నములుతున్న నోరన్నగుడిలో గంటలు క్లోదియార్స్, డ్రేపర్స్ . .. రేయాన్స్, డేక్రాన్ ఫెళఫెళలు ఎండ. శత్రువులా ఎండ వీసె బీరకాయలూ రెండు మణుగుల భారంతో గూడ పీకేస్తున్నాయి. పాత నేమ్ ప్లేట్ పీకేసి ఇత్తడిది కొట్టేస్తున్నాడు వకీలు విశ్వనాథం, బి ఏ బి. ఎల్ ఏటవాలుగా ఆర్టిస్టిక్‌గా అక్షరాలు ఇన్, ఔట్ అవుట్, ఇన్ ఔట్. వకీలు విశ్వనాథం ంథనాశ్వవి శ్వనిథనాం... ంనానిశ్వథ .

కోర్టులో నిశ్శబ్దం ఫేన్ గిరగిర 'పదరు ముద్దాయి అదే రాత్రి ఎం.ంండు పదినిముషాలకు అనగా— నేరం జరిగిన సమయానికి— విజయనగరంలో విభావరి ఉరఫ్ డైమాన్ రాణి ఇంట్లో. అనగా నేరం జరిగిన స్థలానికి సుమారు– తొమ్మిది మైళ్ల దూరంలో— ఉన్నాడని నిరూపించడానికి కావలసిన సాక్ష్యం యిచ్చుటకు యీ సాక్షిని బోను నెక్కించడ మయినది .

నిశ్శబ్దం బద్దలయి ఆశ్చర్యం ఆవరించింది. హో..హో.. జడ్జినోరు రెండంగుళాలు తెరచుకుంది.

చేతిలోని కలం నోట్లోకి అశ్చర్యార్థకంగా వెళ్లింది. కోర్టులో గుసగుసలు.... ప్లీడరు సుబ్బారాయుడు గారి చేతిలో కేసు–పడితే మరి తిరుగులేదు.... ఉరి కంబం మీద ఉన్నా, మర్నాడే యింటికెళ్లి రొయ్యల కూర తినొచ్చని ఆశపడొచ్చు.... హా..హా.. ఓహో నల్లగౌను, తెల్ల బొట్టు.... సిడ్నీ కార్టన్‌లా .. పెర్రీ మేసన్‌లా....

'ఇనిపించదటయ్యో. రోడ్డు మధ్దిని నడకేటి సెవుల్లో ఏటెట్టుకున్నావ్'.. రిక్షాబెల్.. రిక్షా వాడి కేకలు..

ధడాలున, గభాలున, లెంపకాయ కొట్టినట్టు చినుకులు, వాన, గబగబ. ఎండ విరిగింది. సుబ్బారాయుడు పక్కనున్న సత్రంలోకి దౌడు తీశాడు అప్పటికే తడిశాడు తడిసిన మల్లు షర్టు ఎముకల్ని పైకి తోస్తూంది సంచి కింద పెట్టి, నిలబడ్డాడు. చెయ్యినొప్పి. చినుకులు నేలమీద పడి పటాకీల లాగ పేలుతున్నాయి. సిగరెట్ తడిసిపోయింది. ఇంకోటి లేదు. నల్లటి పెదిమెలు పచ్చటి వేలితో మెల్లగా రాసుకోవడం మొదలు పెట్టాడు. ఎదురుగా పెద్ద బోర్డుమీద 'నేడే మన సైన్యంలో చేరండి' జవాన్ తుపాకి పట్టుకుని నిలబడున్నాడు నేడే సైన్యంలో చేరండి చైనా యోధుని నరకండి.... హిమాలయాల్ని రక్షించండి.... హిమాలయాల్ని ... హిమాల....

ఎముకలు కొరికి తినే చలి.... ఎదురుగా దూరంగా చిన్నచిన్న పొదలు. టెంట్‌లో నేఫా మేప్ వేపు దీక్షగా చూస్తూ, కేన్‌తో మార్కు చేస్తూ, బ్రిగడియర్ మిగతా ఆఫీసర్స్‌కి వెర్బల్ ఆర్డర్ యిస్తున్నారు.

బ్రిగడియర్ సుబ్బారాయుడు ముఖంలో శిక్షా కాఠిన్యం కాకలు తీరిన యోధుని శరీరం. ఆరడుగుల దేహాన్ని విల్లులాగ వంచి దీక్షగా మేప్‌లోకి చూస్తున్నాడు. 'కేప్టెన్ ఘన్‌శ్యామ్ 17 00 గంటలకి తన ప్లేటూన్‌ని 051604 దగ్గరకి తీసుకు వెళ్తాడు రూట్— ఫలానా, ఫలానా శత్రువులు 051606 దగ్గర ఉన్నారు. కంపెనీ స్ట్రెంగ్త్. కెప్టెన్ ఉప్రేతీ.... ఎనీ క్వశ్చన్స్? దెన్ ఐ విల్ ఆస్క్ యు.... పదిహేను నిముషాల్లో ఆర్డర్ పూర్తయింది. టైమ్ అందరి వాచీల్లో ఠీక్‌గా కలిపాడు బ్రిగడియర్ సుబ్బారాయుడు ('Boys లెట్స్ హేవ్ ఎ కపుల్ ఆఫ్ టాట్స్ ఆఫ్ రమ్! Let's have a couple of tots of rum)' అని రమ్ బాటిల్ తీశాడు.... ఎర్రగా మెరుస్తూ రమ్, గ్లాసుల్లో . ఎర్రగా మెరుస్తూ ఎర్రగా..





నం. 10 బస్ ఫీంకరిస్తూ, బురద చిమ్ముకుంటూ వెళ్లిపోయింది. సుబ్బారాయుడు సంచి పట్టుకుని రోడ్డుమీదికి వచ్చాడు. ఇస్త్రీ బట్టల్లాగ కొత్తగా ఎండ. నేలమీద తడి, బురద, చెప్పుల టపటపలు. పైజామావెనుక అంతా బురద మార్కులు. రోడ్‌మీద రష్. నల్లగా ఎవడో కండలవాడు తోశాడు సుబ్బారాయుణ్ణి. వాడికి తొందర. సుబ్బారాయుడికి తొందరలేదు. తోపుకి బురద. 'సారీ' అన్నాడు నల్లటి, కండల మనిషి నవ్వుతూ. 'ఫరవా'లేదన్నాడు సుబ్బారాయుడు సిగ్గుగా నవ్వుతూ, బురదలో పడిన సంచివేపు చూస్తూ.

ఇల్లదిగో. ఇల్లంటే ఒకటే ఒక గది. రోడ్డు మీదికే గుమ్మం. గుమ్మం ముందునుంచే నల్లగా కుళ్లుగా కాలువ— మ్యునిసిపాలిటీ వాళ్లది. పది దాటినట్లు దాటి సుబ్బారాయుడు ఇంట్లో అడుగు

న్నాడు. వరసమ్మ వచ్చింది వంట కార్నర్ చీకటి లోంచి. బీరకాయలు నేలమీదికి ఒంపేడు. వరసమ్మ కూర్చుని చూసింది, నేలమీద బీరకాయల్ని. 'పుచ్చులూ, ఎండువీ, చచ్చినవీ .... మీా కెవరో ఏంచిఏంచి అంటగట్టేంది. కాస్త కళ్లు పెట్టుకుని చూడక్కర్లా. కాలవలో పారేయడం నయం. అంటి వరసమ్మ బెడ్ కార్నర్‌వేపు వెళ్లిపోతూ....

'శివా, లార్డ్, భగవాన్, క్రైస్ట్..' గోడకి

## సుబ్బారాయుడి రహస్యజీవితం

హతాశుడై, నిర్వీర్యుడై అనుకున్నాడు. గోడకి ఆనుకుని, చేతులు జాపి.... చేతులు జాపి....

....గొల్గొథా.... కాల్వరి.... దయతో కలిసిన బాధ.... అరచేతులు రక్తం చిమ్ముతున్నాయి. తలమీాద ముళ్ల కిరీటం. జాలిగా ప్రజలవేపు చూస్తూ.. "భగవాన్, వీరిని క్షమించు. వీళ్ళేమి చేస్తున్నారో వీళ్లకి తెలియదు...." తన కిటూ ఆటూ దొంగలు, నేరస్తులు.... ఎలీ, ఎలీ, లామా సబాఖ్ ధానీ....

నేరస్తుల్లాగ సిగ్గుతో, భయంగా నేలమీాద బీరకాయలు. ★


దేవిక

సౌందర్య రహస్యం...

'లక్స్ వల్ల నా చర్మ సౌందర్యం అతిమనోహరం'

అనుచున్నది ఈ సుందర తార



దేవిక ఇలా చెప్పుచున్నది: నా
సౌందర్య సంరక్షణ రోజూ లక్స్‌తో
ప్రారంభం. దాని శుద్ధమైన, సౌమ్య
మగు, నురగ నాకు ప్రీతి...నా చర్మ
సౌందర్యానికి అనువైనది! మరి మీ
చర్మ సౌందర్యానికి కూడాను. మీ చర్మ
సౌందర్య సంరక్షణ గురించి పరిమళ
మైన లక్స్ శ్రద్ధ వహించుగాక!




లక్స్ టాయిలెట్ సబ్బు సినీమా తారలకు సౌందర్యమునిచ్చే శుద్ధమైన, సౌమ్యమగు సబ్బు 4 వానవెల్లి రంగులలోను, తెలుపులోను వున్నది.

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

LTS. 146-149 TE)